

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

# Do-buy

**పోయిన నెలలో నేను మళ్ళీ నా అమెరికా యాత్ర గురించి ఆలోచిస్తూ ఉండగా,** సడెన్‌గా మా లలితా చిట్టె కువైట్ నుండి ఫోన్ చేసి "మేడం మనం దుబాయ్ వెళ్దామా?" అంది.

"ఎందుకు?" అన్నా.

"ఏమైనా కొనుక్కోవచ్చు" అంది.




లిల్లీ దుబాయి వెళదామనగానే నాకు మా కోడిరామకృష్ణగారి సినిమాలోదిఒక డైలాగ్ జ్ఞాపకం వచ్చింది. "వై.విజయను చూపించి (కళ్యాణ చక్రవర్తి అనుకుంట హీరో) చెప్తాడు ఈవిడ మా అక్కాయి, పేరు సక్కుబాయి, ఈవిడ ఉండేది దుబాయి" అని.

అంతకు ముందే నేను సీరియల్‌లో రాసాను. "మా హీరోయిన్ సోప్ కొనాలంటే సూపర్ మార్కెట్‌కి వెళ్ళదు. దుబాయ్ వెళ్తుంది" అని. అది గుర్తొచ్చింది. "చూడు లిల్లీ (తనని అలాగే పిలుస్తాం) నీకు తెలియదు నా భర్తలో ఓ దేశ భక్తుడున్నాడు. ఆయన మన రెవిన్యూని వేరే దేశాల్లో ఖర్చు పెడితే ఊర్కోరు. కావాలంటే ఏ జగ్గయ్య పేటలోనే బంగారం కొంటా, సిమ్లా వెళ్ళి షాల్స్ కొనుక్కుంటా, శ్రీకాకుళం వెళ్ళి చీపుర్లు కొంటా అంటే ఒప్పుకుంటారు" అని చెప్పా.

"అయితే ఏం కొనుక్కోవద్దు. చూసివద్దాం. నేనోసారి వెళ్ళాను. చాలా బావుంటుంది. "అంది.

నాకు అసలే కాళ్ళో చక్రాలు. ఆ రాత్రంతా ఆలోచించా. మర్నాడు "సరేలే.. వెళ్ళొచ్చేద్దాం" అన్నాను.

వెంటనే లిల్లీ వేగంగా టికెట్ ధరలు చూసి బుక్ చెయ్యడం. తను మేరియట్ జెడ్డాఫ్(ఇది కొత్తగా కట్టింది) దానిలో రూం బుక్ చేయించడం వగైరాలూ చేసేసింది.

ఎంతమంది రచయిత్రులకి ఈ భోగం ఉందో నాకు తెలీదు కానీ, నేను కనకుండానే బోలెడు మంది కూతుళ్ళూ, తోడబుట్టకుండానే బోలెడు మంది తమ్ముళ్ళూ, చెల్లెళ్ళని నా రచనల ద్వారా సంపాదించుకున్నాను. లేకపోతే ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ చేసి "నువ్వొస్తే చాలు.. నాతో  నాలుగురోజులు ఉంటే చాలు" అనే చెల్లెలు ఎవరికి దొరుకుతుంది చెప్పండి?

మే 28 రాత్రి నేను హైదరాబాదులో ఎయిర్‌ఇండియా ఫ్లైట్ ద్వారా దుబాయ్ వెళ్ళేట్లు, అప్పటికే కువైట్ నుంచి వచ్చి ఖతర్‌లో తన చెల్లెలు దగ్గరున్న లిల్లీ ఎయిర్ అరేబియా ద్వారా వచ్చేట్లు ఏర్పాటు అయింది.

దుబాయ్ వెళ్ళడం ఈజీ, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళడం కష్టం ఈ ట్రాఫిక్‌లో అని నేను సాయంత్రం ఐదుగంటలకల్లా మా అమ్మమ్మ పద్ధతిలో పులిహోరా, పూరీలూ, మాగాయి ప్యాక్ చేసుకుని (నవ్వకండి. ఫైవ్‌స్టార్ హోటల్ ఫుడ్ రోజూ తినే లిల్లీకి ఇవి అపురూపం.) బయలుదేరాను.

ఎయిర్‌పోర్ట్‌లో నా వీసా చూసి, నేను అందంగా కనిపించాలని మా వారు కలర్ జిరాక్స్‌లో తెస్తే అదివద్దని కౌంటర్‌లో అబ్బాయి బ్లాక్ అండ్ వైట్ అడిగాడు. నేను మెయిన్ కౌంటర్ దగ్గరకి వెళ్ళి వాళ్ళని అడిగి బ్లాక్ అండ్ వైట్ ఫోటో స్టాట్ తెచ్చాను. (జిరాక్స్ అనకూడదు అది కంపెనీ పేరు. ఫోటోస్టాట్ అనాలని మా గురువుగారు ఎన్ని సార్లు చెప్పినా నేను ఇలానే అంటాను. బిస్లరీ అని మినరల్ వాటర్‌ని అన్నట్లు. ఆ కంపెనీలు అంత ప్రాముఖ్యత సంపాదించాయి మరి.)

సరే లోపలికి వెళ్ళి చిప్స్ తింటూ కాంతి పాతూరి, పద్మజా మల్లాది, లిల్లీతో వాట్స్‌అప్‌లో చాట్ చేస్తుండగా, ఓ అబ్బాయొచ్చి కాలింగ్ కార్డ్ 900 /- కే ఇస్తాను కొనుక్కోమని ఎంతగానో బతిమాలాడు. నాదగ్గర ఫోన్ మీద రోమింగ్ వేయించాలే అది చాలు అని అతన్ని చిన్న చూపు చూసాను.

ఈలోగా అక్కడ ఖతార్‌లో లిల్లీ కూడా వాళ్ళ చెల్లెలు కోసం టెన్షన్‌గా ఎదురుచూసి ఎయిర్‌పోర్ట్‌కి బయలుదేరింది.

నా ఫ్లయిట్ కూడా బయలుదేరింది. ఫ్లయిట్ నిండా ఇళ్ళల్లో పనిచెయ్యడానికి వెళ్ళే చిన్న అమ్మాయిలు అంటే పద్దెనిమిది నుండి ముప్పై లోపు వయసువాళ్ళు. వాళ్ళు ఫ్లయిట్‌లో గొడవ గొడవగా "నీ ఎస్.ఎమ్.ఎస్ వచ్చిందా? నాకు రాలేదే?" అంటూ కంగారుగా మాట్లాడుకోవడం, కొంతమంది భయంతో ఏడవడం చూసాను. బహుశా ఎవరు రిసీవ్ చేసుకుంటారో వాళ్ళు ఎస్.ఎమ్.ఎస్ పంపాలనుకుంటాను. నాపక్క సీట్ ఖాళీగా వచ్చింది. ఆ పక్కన ఓ అబ్బాయి కూర్చున్నాడు. అతనూ ఏదో లేబర్ పనిచేసేవాడే అనకాపల్లి నుండి వెళ్ళి చాలా కాలం అయిందట. తండ్రి పోతే వచ్చి వెళ్తున్నాడట.

ఎయిర్ ఇండియాలో ఎయిర్‌హోస్టెస్ కొద్దిగా వయసు మీరినవాళ్ళు ఉంటారు. ఫుడ్ మాత్రం చాలాబావుంటుంది. వాళ్ళు వాళ్ళ టైం ఎలా ఎడ్జెస్ట్ చేసుకుంటారంటే జ్యూస్, పల్లీలు ఇచ్చి, మళ్ళీ వాళ్ళు ఆ ట్రాష్ కలెక్ట్ చేసుకుని, ఇంకో రౌండ్ డ్రింక్స్ అడిగి, తరువాత మీల్స్ ఇచ్చి, మళ్ళీ ట్రాష్ కలెక్ట్ చేసుకుని కాఫీ సర్వ్ చేసి ఆ కప్పులు తీసేలోగా మన డెస్టినేషన్ వచ్చేట్లు. అమెరికా వెళ్ళేప్పుడు కూడా ఎప్పుడూ వాళ్ళు ఖాళీగా ఉన్నట్లు నాకు కనిపించలేదు. కానీ ఖతార్ ఎయిర్ వేస్‌లో అమ్మాయిలు దానిమ్మ మొగ్గల్లా ఉంటారు చిరునవ్వుతో. వీళ్ళు కాస్త ధుమధుమలాడ్తూ కనిపించారు.


మేరియట్ జెద్దాహ్

9.20కి నా ఫ్లయిట్ బయలుదేరింది. నేను టీ.వీ.లో "కామెడి విత్ కపిల్ ఎపిసోడ్స్" కొన్ని చూసి ఎంజాయ్ చేసాను. షార్జా చేరేటప్పటికి మన టైమ్‌లో 11.30, వాళ్ళ టైంలో పది అయింది. వాళ్ళు గంటన్నర వెనక్కి అన్నమాట. అమెరికా వెళ్ళినప్పుడు ఈ టైంజోన్‌లు నన్ను పిచ్చిగా కన్‌ఫ్యూజ్ చేస్తాయి.


దుబాయ్ ఎయిర్‌పోర్టులో

నేను వెళ్ళి 'న్యూవీసా వాళ్ళ ఐస్కాన్' క్యూలో నిలబడ్డాను. అప్పుడు నా ఫోన్‌లో దుబాయ్ సిగ్నల్ వచ్చింది. కానీ వెంటనే సిగ్నల్స్ పోయాయి. రోమింగ్ పనిచెయ్యడం లేదని

అర్థమైంది. లిల్లీ ఎక్కడ దిగిందో, ఏం చేస్తుందో, తెలివైన పిల్లకాబట్టి, నాకన్నా అరగంట ముందే దిగింది కాబట్టీ లగేజ్ కలెక్ట్ చేసుకునే చోట కలుస్తుందిలే అని ధైర్యంగా ఉన్నాను.

ఇంతలో వెనకనుండొచ్చి నాకళ్ళు మూసి "ఎవరో చెప్పుకోండి" అంది. నా ఐ.క్యూని అంతలా అంచనా వేసింది.

"లిల్లీ ఈ దేశంలో ఎవరు నా కళ్ళు కప్పగలరు?" అన్నాను.



నీల్‌మినీ

ఐస్కాన్ అయి మేం బయటపడేసరికి 12.30 అయింది. వరుసగా ఆగి ఉన్న టాక్సీల దగ్గరకి వెళ్ళి "మేరియట్ జెడ్డాఫ్" అని చెప్పాం. వాళ్ళు లైన్‌లో ముందున్న వాళ్ళని చూపించారు. తీరా మేం వెళితే అతను పోలీస్‌ని చూపించాడు. ఎందుకా అనుకున్నాం, అప్పుడు అతను ఒక అమ్మాయి నడిపే టాక్సీలో మమ్మల్ని ఎక్కించాడు. ఆ అమ్మాయి పేరు నీల్‌మినీ, సింహళీ అమ్మాయి. ఒంటిగంటకి మా ఇద్దర్నీ అమ్మాయి నడిపే టాక్సీ ఎక్కించి పోలీస్ సురక్షితంగా పంపించాడు. ఆ అమ్మాయితో మాట్లాడుతూ మేరియట్ చేరాం. ఆ అమ్మాయి ఆడపిల్లకి 'భయం' అనేమాటకి దుబాయ్‌లో స్థానం లేదని చెప్పింది. నేను చాలా సంతోషించాను.



సర్కిల్స్ సర్కిల్స్‌గా

మేం దాదాపు ఆ నిర్మానుష్యమైన వీధుల్లో ముప్ఫైనిమిషాల పైగా ప్రయాణించి మేరియట్ హోటల్‌చేరాం. ఆ హోటల్ కనిపిస్తూనే ఉంటుంది కానీ సర్కిల్స్ సర్కిల్స్‌గా తిరిగి చేరడం మెదడుకి మేతలా జిగ్‌జాగ్ పజిల్‌లా అనిపిస్తుంది.

హోటల్ ముందు టాక్సీ దిగి ఎనభై ధీరమ్స్ అయితే లిల్లీ వంద ఇచ్చేసింది. నీల్‌మినీతో ఆ లైట్ల కాంతిలో ఫోటో కూడా తీయించుకున్నాం. లోపలికి వెళ్ళి ఫోర్త్ ఫ్లోర్‌లో ఉన్న మా రూంలో చెకిన్ అయ్యాం. అహ్మద్ అనే అబ్బాయి అప్పుడు ఫ్రంట్ డెస్క్‌లో డ్యూటీలో ఉన్నాడు. ఇక్కడ ఒక ధీరమ్ మనకి పదహారు రూపాయలు.




మేం ఇద్దరం రూంలోకి వెళ్ళాక, అప్పుడు దుబాయి వచ్చినట్లు నమ్మకం చిక్కి, చాలా ఆనందించాం. ఖతర్‌లో లిల్లీ ఎయిర్‌పోర్ట్ చేరేసరికి, గేట్ మారిపోయి ఇంకో చోట పెట్టినట్లు తెలిసిందట. "ఆఖరి నిమిషంలో బోర్డ్ అయ్యాను, నేను వెళ్ళలేకపోతే మేడం ఎంత ఇబ్బంది పడ్తారో అని భయపడ్డాను" అంది. ఆ రాత్రి నేను తెచ్చిన ఫుడ్ తింటూ, కబుర్లు చెప్పుకుంటూ ఉంటే టి.వీలో "Welcome to lalitha chitte to Marriotte Hotel and Marriotte Executive Appartments" అని స్క్రోలింగ్ వెళ్తోంది. నేను అది చూసి ఎగ్జైట్ అయి అరిచాను. లిల్లీకి ఆ పద్దతులన్నీ తెలుసు ఆ స్క్రోలింగ్ ఫోటో తీసాను.

తెల్లవారు ఝామున నాలుగింటికి పడుకుంటూ, "రేపు పదిగంటలవరకూ లేవద్దు మేడం. మనిష్టమొచ్చినప్పుడు బయటకెళ్ళి షాపింగ్ చేసి అక్కడే తిందాం" అంది. సరే అన్నాను. కానీ నేను ఏడున్నరకల్లా లేచేసాను. నన్ను చూసి పాపం లిల్లీకూడా లేచి కూర్చుంది. బ్రష్ చేసుకుని కాఫీ కలుపుకుంటూ కబుర్లు, అబ్బా! కబుర్లు..కబుర్లు.. కబుర్లు... మాకు ఎన్ని చెప్పుకున్నా తనివి తీరడం లేదు.

నా ఫోన్ ఇంక పనిచెయ్యదు అని నిర్ధారించుకుని నేను లిల్లీ ఫోన్ నుండి దినేష్‌కి ఫోన్ చేసాను. దినేష్ నెంబర్ మా డైరెక్టర్ వి.ఎన్.ఆదిత్య ఇచ్చి అతను లోకల్‌గా హెల్ప్ చేస్తాడని చెప్పాడు. లిల్లీకి వాళ్ళ ఫ్రెండ్ ఫర్జానా (నన్నూ) ఫోన్ చేసింది. అప్పుడు లిల్లీ స్నానం చేస్తోంది కాబట్టి నేను ఎటెండ్ అయ్యాను ఆ ఫోన్ కాల్. మూడునిమిషాల్లో, ఆ పాకిస్తానీ ఫ్రెండ్ నేనూ చాలా మాట్లాడేసుకున్నాం. క్లోజ్ అయిన భావన కలిగింది.

లిల్లీ వచ్చాక ఆవిడ ఆ మాటే లిల్లీతో కూడా చెప్పిందట. ఆవిడ భర్త ఒకప్పుడు కువైట్ హోటల్‌కి ఫైనాన్షియర్‌ట. అలా పరిచయం.

దినేష్ ఫోన్లో మాట్లాడాక, ప్రేమ్ అనే అతనికి మా నెంబర్ ఇచ్చాడు. ప్రేమ్ ఆ రోజు సాయంత్రానికి మాకు 'డైనర్ క్రూయిజ్' బుక్ చేయించాడు.

నేనూ లిల్లీ తయారయి, అసలు ముందూ వెనుకా ఆలోచించకుండా 'గోల్డ్‌సూక్'కి టాక్సీ మాట్లాడేసుకున్నాం. లిల్లీ ఇంతకు ముందు వెళ్ళింది కాబట్టి ఆ ఏరియా పేరు 'దాయెరా' అని తెలుసు. టాక్సీ డ్రైవర్ల గురించి కొంత చెప్పాలి. వాళ్ళు ఎక్కువగా బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఇండియా నుండి వచ్చినవాళ్ళు. ఎక్కగానే మనకి ఒక స్లిప్ ఇస్తారు. దాంట్లో అతనిపేరూ, ఫోన్ నెంబరూ, లైసెన్స్ నెంబరూ ఉంటుంది. మనం పొరపాటున ఏవైనా టాక్సీలో మర్చిపోయి దిగిపోతే ఆ నెంబర్‌కి కాల్ చేస్తే వెంటనే తెచ్చిస్తాడనమాట. ఈ పద్ధతి మనదేశంలో ఎప్పుడొస్తుందో?


ఒక ధీరమ్ బోట్‌లో ప్రయాణం

బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ఇస్మాయిల్ అన్న డ్రైవర్ మమ్మల్ని చూసి 'మీరిద్దరూ అక్కచెల్లెళ్ళా?' అని అడిగితే మేం నవ్వేసి ఊరుకున్నాం. అతను మళ్ళా 'మీరు అక్క చెల్లెళ్ళు కాదు పోలికలని బట్టి మీరు ఫ్రెండ్సే అనుకుంటున్నాను' అన్నాడు. 'అదేంటి ఫ్రెండ్స్‌కి పోలికలు ఉంటాయా? ' అని మేమంటే 'మీ ఇద్దరికీ పోలికలు లేవు కాబట్టే ఫ్రెండ్స్. పోలికలు ఉంటే అక్కచెల్లెళ్ళు' అన్న అతని మాటలకి నాకు చాలా ముచ్చటేసింది.

ముఖ్యంగా దుబాయ్ టూరిస్టుల మీద ఆధారపడి నడిచే దేశం కాబట్టి, వాళ్ళు టూరిస్టుల ఎడల చాలా మర్యాదగా వ్యవహరించాలి. క్రైమ్ రేట్ ఉండకూడదని ఆ రాజు అహ్మద్ జాయేద్ శాసనం. శిక్షలకి భయపడి ఎవరూ నీతి తప్పరు.


దుబాయ్‌లో మాల్

ఈ మాల్స్ లేదా సూక్‌లన్నీ నీట్‌గా, ఎయిర్ కండిషనింగ్ చేయబడ్డవే. ఇవతలవైపు నుండి అవతల ఒడ్డుకి బోట్‌లో ప్రయాణించడానికి ఒక ధీరమ్ తీసుకుంటారు. అదే చుట్టూ తిరిగి వెళితే పాతిక ధీరమ్స్ ఎక్కువ అవుతాయి. మేం అంత ఎండలోను బోట్ ప్రయాణం ఎంజాయ్ చేసాం. ఎంతో ఆహ్లాదంగా అనిపించింది.



దుబాయ్‌లో రెండు రకాల వెదర్‌లుంటాయిట. హాట్ వెదర్, వెరీ హాట్ వెదర్.. అంతే! అక్కడ రోడ్స్ మీద మనకి బైక్స్ కానీ ఇతర టూవీలర్స్ కానీ కనపడవు. ఎందుకంటే ఆ వెదర్ వల్ల, వాటి రేట్లు అధికంగా పెంచి, కార్లు చవకగా అమ్ముతారట. ఒక బైక్ 1500 ధీరమ్స్ నుండి 80,000 ధీరమ్స్ వరకూ ఉంటుందిట. పదివేల ధీరమ్స్‌కే కారు, కారుచవకగా వస్తుంది. 1.6 ధీరమ్స్‌కి ఒక లీటర్ పెట్రోల్. మంచినీళ్ళు కూడా అంతే. పెట్రోల్ నీళ్ళలా వాడడం అంటే అదే!

కేవలం దుబాయ్‌లోనే అతి పొడవాటి రైల్వే సిస్టం ఓల్డ్ దుబాయ్ టు న్యూ దుబాయ్ దాకా చూస్తాం. ఇక్కడంతా నోళ్ళు విప్పితే The Biggest, The Longest, The Greatest, The Honest లాంటి పదాలే వాళ్ళ దేశం గురించి వాడుతూ ఉంటారు. ఎంత అదృష్టం!

ఈ గోల్డ్ సూక్‌లలో పద్దెనిమిది కేరట్ల నుండీ ప్యూర్ 24 కేరట్ల వరకూ గోల్డ్, బోర్డులు కట్టి ఆ రోజు ధరలు వేస్తారు. కర్టెన్లు వేళ్ళాడగట్టినట్లు గోల్డ్ వేళ్ళాడుతూ ఉంటుంది. అసలు రోడ్లమీద పెద్ద రక్షణ లేకుండా ఆ షాపులు అలా వదిలేసి పోవడం నాకు ఆశ్చర్యం. పోలీస్ ఎక్కడా కనపడరు. కానీ మన చుట్టూ ఉంటారుట మఫ్టీలో. మనం కాస్త గొంతు పెంచి "ఏ క్యాహై.. క్యా బోల్ రే ఆప్" అన్నావంటే "క్యాహువా?" అని వెంటనే అటెండ్ అవుతారట. ప్రతి నాలుగోవాడూ జనంలో పోలీసట. ఇవన్నీ మాకు తరువాత అజీజ్ అనే గైడ్ చెప్పాడు.


మేరియట్ హోటల్‌లో

నాకు ఆ గోల్డ్ సూక్‌లో తిరుగుతుంటే, "అంగళ్ళ రతనాలు అమ్మినారట.. ఇచట" అన్న శ్రీకృష్ణదేవరాయల స్వర్ణయుగం గుర్తుకొచ్చింది. 18 కేరట్స్, ఇది 22 కేరట్స్, 24 కేరట్స్ అని షాపులో రాసి పెడ్తారు. గ్రాం ధర మన కరెన్సీకి ఎన్ని ధీరమ్స్ ఎక్కడైనా ఒక్కలాగే ఉంటాయి. కౌంటర్ చెక్ చెయ్యక్కర్లేదు. ఇంకోమాట అక్కడ దొరికే బంగారం స్వచ్ఛమైనది. ఇక్కడ బంగారం 24 కేరట్స్ అయినా దానిలో కల్తీ ఉంటుంది. అలా సూక్ అంతా చూసుకుంటూ ఇంకో వైపుకి వెళ్ళి కొంత షాపింగ్ చేసాం. అలసిపోయాక ఢిల్లీ దర్బార్ అనే మన హోటల్లో భోజనం చేసాం. బిరియానీ, రోటీలూ, కూరా అన్నీ చాలా బాగున్నాయ్. ముఖ్యంగా ఇలాచీ 'టీ' అద్భుతంగా ఉంది.

మళ్ళీ ఒడ్డుకొచ్చి పడవెక్కి అవతల ఒడ్డుకి చేరి టాక్సీలో హోటల్‌కి చేరాం. టాక్సీ రేట్లు మన డబ్బుల్లో చెపితే వెయ్యికి తక్కువ అవదు.

రిఫ్రెష్ అయ్యేసరికి డైనర్ క్రూయిజ్ పికప్ కారు రానే వచ్చింది. మేం అంత హడావిడిలోనూ కారిడార్స్‌లో ఫోటోలు తీసుకోవడం మర్చిపోలేదు.

మేం ఆ కారులో వెళ్తూనే ఆ డ్రైవర్‌తో మర్నాడు మాకు సిటీ టూర్ కావాలనీ, ఇలాగే ప్రొద్దుటే వచ్చి పికప్ చేసుకోవాలనీ మాట్లాడుకున్నాం.



ఇంక డైనర్ క్రూయిజ్‌లో ఒకటే సందడి. బోలెడు తినుబండారాలు, సాఫ్ట్ డ్రింక్స్, మధ్యలో ఒళ్ళంతా లైట్లు కట్టుకున్న డ్రెస్సుతో ఒకబ్బాయి చేసిన అరబిక్ డాన్సులు. ఈ సందడిలో మా భోజనాలు. బఫే పెట్టారు. లిల్లీ నాకు ఆ తినుబండారాలన్నీ ఎక్స్‌ప్లైన్ చేసింది. అరబిక్ రోటీలూ, ఫాలుదా, రకరకాల పుడ్డింగ్‌లూ, జెల్లీలూ, పేస్ట్రీలూ, సలాడ్స్, వెజ్ నాన్ వెజ్ కర్రీస్ అన్నీ ఉన్నాయి.


డైనర్ క్రూయిజ్‌లో డిన్నర్

పక్కనుంచి వెళ్ళే షిప్పులు లైట్లతో ధగధలాడిపోతూ అందంగా కనిపించాయి. దాదాపు గంటన్నరపాటు భోజనంలో, డాన్స్‌లో ఉండిపోయాం. తరువాత మళ్ళీ మమ్మల్ని మా హోటల్ దగ్గర దింపి, ప్రొద్దుటే 9.30కల్లా రెడీగా ఉండాలని చెప్పి వెళ్ళారు వాళ్ళు. డైనర్ క్రూయిజ్‌లో ఇద్దరికీ కలిపి 180 ధీరమ్స్ తీసుకున్నారు. ఆ రాత్రే లిల్లీ ఫ్రెండ్ లిల్లీని, నన్నూ మర్నాడు రాత్రి వచ్చి కుటుంబ సమేతంగా డిన్నర్‌కి తీసుకువెళ్తాం మీరు ఖాళీ పెట్టుకోండి అని చెప్పింది. మేం ఆ రోజూ కబుర్లతో

ఆలశ్యంగా పడుకున్నాం. ఎంత త్వరగా లేద్దామన్నా కుదరలేదు. ఓ ఇరవైనిమిషాలు కారు అతన్ని వెయిట్ చేయించి క్షమార్పణలు చెప్పుకుని సిటీ టూర్‌కి బయలుదేరాం. అది 220 దీరమ్స్ ఇద్దరికీ కలిపి.

మా గైడ్ అజీజ్ అతనికి కొద్దిగా తెలుగు తెలుసు. చాలా షార్ప్, సెన్స్ ఆఫ్ హ్యూమర్ కల అబ్బాయి.

అక్కడ స్త్రీలు అబయా ధరిస్తారు. తలమీద ముసుగుని షైలా అంటారు. మగవాళ్ళు ధరించే అరబ్బీ డ్రెస్సుని, 'స్కన్‌డోరా' అని పొడవాటి గౌనునీ, 'స్కోర్ఫియా' అని నెత్తిమీద వేసుకునే దాన్ని, తల మీద పెట్టుకునే నల్లటి చట్రాన్ని 'అకిల్' అనీ అంటారు. అరబ్ కంట్రీస్ అన్ని చోట్లా ఖర్జూరం విపరీతంగా పండుతుంది. 'అజ్వా' అనే జాతి ఖర్జూరం గుండెకి చాలా బలం.

ఇళ్ళన్నీ క్రీమ్ కలర్‌లో ఉంటాయి. అందువల్ల కూలింగ్ ఎక్కువట. వేరే రంగు వేసుకోవాలనుకునే వాళ్ళు తమ ఇళ్ళకి, గవర్నమెంట్ దగ్గర నుండి పర్మిషన్ తెచ్చుకోవాలి. టాక్స్‌లు కూడా అదనంగా కట్టాలి. మన ఇండియాలో లాగా యూనిఫార్మిటీ లేకుండా ఏదీ ఉండదు అనమాట.  కానీ ఎవరికీ ఇళ్ళు కట్టుకునే అధికారం కానీ ఎన్నేళ్ళున్నా సిటిజెన్‌షిప్ ఇచ్చే చట్టం కానీలేదు. ఎందుకంటే పిల్లలకి ఎడ్యుకేషన్ ముసలివాళ్ళకి మెడికల్, అన్నీ ఫ్రీ ఆ దేశస్తులకి. మనలాంటి అన్యదేశస్తులకి పనిచేసి సంపాదించుకునే హక్కు తప్ప వేరే హక్కులు ఇవ్వలేదు ఆ గవర్నమెంట్. 2020 Expo కోసం ఎక్కడ చూసినా మాల్స్, పెద్ద పెద్ద Sky Scapers నిర్మాణంలో ఉన్నాయి. బస్ ఎక్కితే టిక్కెట్ ఉండదు. ముందే కొనుక్కున్న కార్డుని పంచ్ చేస్తే లోపలికి వెళ్ళగలం. ఎక్కడ చూసినా మాల్స్‌లో, సూక్‌లలో, చివరకి డ్రైవర్స్‌కి ఇచ్చే ఎకామిడేషన్లుకూడా ఎయిర్ కండీషనింగే. దుబాయ్‌లో స్కై స్క్రేపర్స్‌గానీ,  ఫ్లైఓవర్లు, రోడ్లు ప్రతివారం క్రొత్తగా మారిపోతుంటాయట. ఎందుకంటే అంత వేగవంతంగా నిర్మాణాలు జరుగుతాయి

బస్‌లల్లో కానీ, టాక్సీల్లో కానీ రోడ్లమీద కానీ, స్మోకింగ్, డ్రింకింగ్‌తో బాటు చూయింగ్ గమ్ నమలడం కూడా శిక్షార్హమే! మన రోడ్లమీద గుట్కాతిని ఉమ్మేవాళ్ళని అక్కడకి పంపి శిక్షలు వేయించాలి.

ఒకసారి లిల్లీ హైదరాబాద్ వచ్చినప్పుడు ఒక బిల్డింగ్‌లోకి మెట్ల దారి మీద నుండి వెళ్తుండగా, కార్నర్స్‌లో జీసస్, మసీద్, వినాయకుడి టైల్స్ నేలమీదుగా పెట్టుండడం చూపించి "ఎందుకో చెప్పగలవా?" అన్నాను. ఆమెకి తట్టలేదు. "పాన్ తిని ఉమ్మకుండా" అని చెపితే ఆశ్చర్యపోయింది. మనవాళ్ళు పాన్ మాత్రమే కాదు చూయింగ్ గమ్, ఇంకా ఉట్టుట్టిగా ఉమ్ముతుంటారు రోడ్ల మీద! స్వేచ్ఛని ప్రకటించుకోడానికి మూత్రం కూడా బాహాటంగా చేస్తుంటారు.

ఈ సందర్భంగా ఒక విషయం గుర్తొస్తోంది. ఓ ఆర్ట్ ఫిల్మ్ సెన్సార్ చేస్తుండగా, ఒక దృశ్యం నన్ను ఆకర్షించింది.

ఒక పోలీస్ కానిస్టేబుల్ బహిరంగ ప్రదేశంలో గోడమీద మూత్ర విసర్జన చేస్తాడు. చేసొచ్చి ఒక యువజంట పబ్లిక్ ప్లేస్‌లో ముద్దు పెట్టుకుంటున్నారని చలానా రాస్తాడు. అప్పుడు ఒక కొజ్జా వచ్చి "నువ్వు చేసిన పనికన్నా అసహ్యమైనదా వీళ్ళు చేసిన పనీ? వీళ్ళు ముద్దు పెట్టుకుంటే సమాజానికి ఏమైనా హాని ఉందా?" అని అడుగుతుంది. దాన్ని సెన్సార్ కత్తెరతో కట్ చెయ్యకుండా ఉంచాలని నేను వాదించి ఉంచేట్లు చేసాను. మన సివిక్‌సెన్స్ అదీ.



రాజకుమారుడు షేక్ అహ్మద్ ఒంటరిగా, సెక్యూరిటీ లేకుండా నగర వీధుల్లో, మాల్స్‌లో అప్పుడప్పుడూ కనిపిస్తాడుట. అలాగే స్త్రీలు అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా ఎప్పుడైనా తిరగొచ్చు. అంత రక్షణ. సేఫెస్ట్ సిటీ ఇన్ ద వరల్డ్ అని గైడ్ చెప్పాడు. తుపాకీ భయం, దైవ భీతీ సమానంగా పనిచేస్తాయి అనుకుంట.

'సాగా ఇవా ది వరల్డ్' అనే మ్యూజియం దగ్గర మా బస్ ఆపారు. ఆ మ్యూజియంలో దేశంలో ఉన్న వృత్తి పనులన్నీ చేస్తున్న బొమ్మలున్నాయి. అవన్నీ నిజంగా మనుషుల్లా ఉన్నాయి. అక్కడ జెండా నలుపు, ఆకుపచ్చ, పసుపు రంగుల్లో ఉంది. నలుపు - చమురుకీ, ఆకుపచ్చ - సుభిక్షతకీ, పసుపు -

పర్రాక్రమానికి సూచనట. ఇక్కడ రాతిపాత్రల యుగంలో కూడా స్త్రీల పూసల, రాళ్ళ నగలు చూస్తే స్త్రీల సౌందర్యాభిలాష తెలుస్తుంది. ఆ తరువాత జుబేరా రోడ్‌లోకి వెళ్ళాం.


నిజమైన మనుషుల్లాంటి బొమ్మలు



పామ్ జుబేరా అనే దీవిని కర్జూరపు వృక్షం ఆకృతిలో మలిచారు. ఆదివారాలు స్త్రీలకి మాత్రమే సందర్శనం. టూరిస్ట్‌లు అంటే చాలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. అతిధి దేవో భవ అన్నమాట అక్కడ అక్షరాలా నిజం. మనం ఖర్చు పెట్టే డబ్బుతోనే ఆ దేశ ఆర్ధిక విధానం ఆధారపడి ఉంటుంది మరి. రోడ్లు ఎక్కడంటే అక్కడ క్రాస్ చేసినా, సిగరెట్లు, పాన్‌లూ, ఉమ్మినా, గమ్‌లూ, కాయితాలు పారేసినా శిక్షలు తీవ్రంగా ఉంటాయి.

జుమేరా రోడ్ అంతా మెడికల్ ఫ్యాక్టరీలూ, స్పాలూ ఎక్కువగా కనపడ్డాయి. 2.6 మిలియన్లు అక్కడ ఉండాల్సిన జనాభాగా నిర్ణయం అయింది. అక్కడ స్థానికులకి మెడికల్, ఎడ్యుకేషన్, పాస్‌పోర్ట్ అన్నీ ఫ్రీ. ఎవరైనా నాలుగు సార్లు వివాహం ఆడచ్చు. కానీ చాలా నిబంధనలతో.

భార్యకి తగ్గని అనారోగ్యం ఉన్నప్పుడు కానీ, భార్య మరణిస్తే కానీ, బ్రతికుండగానే ఆమె అంగీకారంతో కానీ వివాహమాడచ్చు. కానీ అందరినీ సమానంగా చూసుకోవాలి.

ఇక్కడ ఇస్లామిక్ సెంటర్ అనే పెద్ద మతపరమైన బిల్డింగ్ ఒకటి వచ్చింది. అందులో మనం ఇస్లాం మతం గురించి ఏమైనా తెలుసుకోవాలనుకుంటే ముందు రోజు ఫోన్‌లో ఎపాయింట్‌మెంట్ తీసుకుంటే, మర్నాడు ఠంచన్‌గా ఉదయం పదికల్లా మనకి ఫోన్ చేసి, పిలుస్తారు. మనకి కావలసిన వివరాలన్నీ చెప్తారు.

బ్రిటీషర్స్ పాలన క్రింద ఉన్నప్పుడు అతి పొడవాటి మార్గం నిర్మించారు. దాన్ని 2nd December Street అంటారు. ఇక్కడ మనం అతి పెద్ద చేపల మార్కెట్ కూడా చూడచ్చు. ఈ ఫామ్ జుబేరాకి పదిహేడు బ్రాంచెస్ ఉన్నాయి. హయత్ రీజెన్సీ హోటల్ అతి పెద్ద రొటేటింగ్ హోటల్.



ఈ పామ్ జుబేరా ఐలాండ్‌లో గొప్పగొప్పవాళ్ళు విల్లాస్ కొన్నారు. షారూఖ్ ఖాన్, బ్రాడ్‌పిట్, సచిన్ టెండూల్కర్, ఏంజిలీనా జోలీ లాంటివాళ్ళు. ఇలా గైడ్ మాట్లాడ్తూ "నేనూ ఒకరోజు అక్కడ వాళ్ళ పక్కన విల్లా కొంటా.. ఏదీ అసాధ్యంకాదు" అన్నాడు. ఆ ఇరవై ఆరేళ్ళ యువకుడి మనోబలానికి మేం అందరం థమ్స్ అప్ సైన్ చూపించి లైక్‌లు కొట్టాం.

ఈలోగా నీళ్ళ క్రిందుగా మేం ట్రంక్ లోనుండి స్టెమ్‌లోకి ప్రయాణించాం (ఆ దీవి కర్జూరపు వృక్షం ఆకృతిలో ఉందిగా మరి) "మీ లైఫ్ జాకెట్స్ సీట్ కింద ఉన్నాయి వేసుకోండి" అని గైడ్ అనగానే, కొంతమంది విదేశీయులు సీట్ కింద చెయ్యిపెట్టి వెతికారు. అతను నవ్వుతూ "ఐ యామ్ జస్ట్ కిడ్డింగ్" అన్నాడు.

తరువాత బుర్జ్ ఖాలీఫాని చూపించాడు. ఆడ్రే ఆడర్‌సన్ అనే అమెరికన్ ఆర్కిటెక్ట్ అందులో హోటల్ నిర్మించాడని చెప్పాడు.

పామ్ జుబేరా బీచ్‌లో ఇసక కూడా అతి మెత్తగా మైదాలా ఉంటుందిట. ఎందుకంటే సముద్రం మధ్యలోంచి వేల ట్రక్కులతో ఆ మెత్తటి ఇసకని తెప్పించారట.

ఆ ఇసక నీటిలో కొట్టుకుపోదుట.

బుర్జ్ ఖలీఫాలో 18 కేరట్ గోల్డ్‌తో రెండు లైఫ్ సైజ్ గుర్రాల ప్రతిమలుంటాయిట. నాలుగు గోల్ స్థంభాలుంటాయిట. ఆ హోటల్‌లో 2,700 ధీరమ్స్ ఒక పెగ్‌ట. అది 27వ ఫ్లోర్‌లో ఉండబట్టి. ఒకరాత్రి అక్కడ ఉండాలంటే 70,000 దీరమ్స్ చెల్లించాలట.

ఇలా చెప్తూ మిమ్మల్ని దుబాయ్, నుండి పర్‌దుబాయి తీసుకొచ్చాడు.


గైడ్ అజీజ్‌తో

తిరుగు ప్రయాణంలో మేం దుబాయి మాల్ దగ్గర దిగిపోయాం. అజీజ్ మాతో ఫోటో తీయించుకుని తన మెయిల్ ఐ.డి ఇచ్చి మెయిల్ చెయ్యమనీ, ఎప్పుడొచ్చినా కాల్ చెయ్యమనీ కార్డ్ ఇచ్చాడు.

నేనూ లిల్లీ మాల్‌లోకి వెళ్ళి ముందు ఫుడ్ కోర్టులో తిండి తిన్నాం. మన ఇండియన్ ఫుడ్ చాలా కాస్ట్లీగా ఉంది. పిజ్జాలూ, బర్గర్‌లూ అన్నీ ఫర్వాలేదు.

మాల్ చూసాక మళ్ళీ గోల్డ్‌సూక్ వెళ్ళాం. ఈసారి నేను రెండు గొలుసులు కొన్నాను. సాయంత్రం ఫర్జానా వాళ్ళు వస్తారు మమ్మల్ని డిన్నర్‌కి తీసుకెళ్ళడానికి అని త్వరత్వరగా టాక్సీ చేసుకుని హోటల్‌కెళ్ళాం.

కాసేపు రెస్ట్ తీసుకుని తయారయ్యేసరికి పొడవాటి వ్యాన్‌లో ఫర్జానా, ఆమె భర్త అక్తర్, పిల్లలు (ఆస్మా మెడిసిన్ చేస్తోంది. ఆమ్నా, బిలాల్ గ్రాడ్యుయేషన్ చదువుతున్నారు) అంతా వచ్చేసారు.

ఆ తరువాత కాలం మాకు తెలియకుండా దొర్లిపోయింది. వాళ్ళ పిల్లలు మాతో కలవిడిగా కలిసిపోయారు. పాటలు పాడుకున్నం. అల్ బ్రిహ్మాస్ అనే పాకిస్తానీ రెస్టారెంట్‌కి వెళ్ళాం. అక్కడ ఆల్ అంటే మన శ్రీ అనే అర్ధం వచ్చే పదమంట. అక్కడ అతి పెద్ద బఫే చూసాను. వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్ డిషెస్ చాలా చూసాను. పానీపూరీ మనదానిలాలేదు కానీ పెట్టారు. వెజిటబుల్ ఫ్రైడ్‌రైస్ దాల్, రకరకాల పుడ్డింగ్స్‌తో పాటు జిలేబీ, గులాబ్‌జామ్, ఫాలుదా, బర్ఫీ, కలాఖండ్‌లాంటి ఇండియన్ స్వీట్స్ కూడా ఉన్నాయి. ఆ తరువాత ఫ్రూట్స్.


ఫర్జానా, ఆమె భర్త అక్తర్, పిల్లలు ఆస్మా, ఆమ్నా, బిలాల్

నన్నూ, ఈలోగా ఆస్మా నేనూ అతి చనువుగా ఉండడం చూసి అత్తాకోడళ్ళలా ఉన్నాం అనేసింది. దానికి ఆ అమ్మాయి కూడా స్పోర్టివ్‌గా, "నాకు ఇలాంటి అత్తగారే కావాలి. నాకు నచ్చారు." అంది.

ఆ తరువాత మమ్మల్ని సాస్ బహూ అన్నారు మిగతావాళ్ళు.

అక్కడినుండి ఫెస్టివల్ సిటీ కెళ్ళాం. ఎంతసేపు మాట్లాడుకున్నా తనివి తీరలేదు. నన్నూ నాతో "మీరు నాకు ఎన్నో ఏళ్ళుగా నాకు స్నేహం అనిపిస్తోంది" అంది.

ఎక్కడ పాకిస్తాన్... ఎక్కడ మన హైదరాబాద్. స్నేహానికి ఎల్లలు లేవు కదా!

వాళ్ళు మమ్మల్ని హోటల్ దగ్గర దింపి వెళ్ళేసరికి అర్ధరాత్రి అయింది. నేనూ లిల్లీ గడిచిపోయిన రోజు గురించి చాలాసేపు మాట్లాడుకుని పడుకున్నాం. ఆ మర్నాడు కూడా లేట్‌గా లేచాం. చిన్నపాటి షాపింగ్స్ తప్ప పెద్ద పనులేం లేవు. డిజర్ట్ సఫారీలాంటివి ట్రై చెయ్యొద్దు అని మా డాక్టర్ స్ట్రిక్ట్‌గా చెప్పి పంపించారు. (నాకు స్పైనల్ సర్జరీ అయిందిగా.)

ఇక్కడ హైదరాబాద్‌లో ఉండగానే వీరేంద్రనాథ్ గారు తను 29 రాత్రి బయలుదేరి 30న దుబాయ్ వస్తున్నట్లూ 31న ‘TEAM’ అనే సంస్థ వాళ్ళు చేసే కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు అక్కడ కలుద్దాం అని చెప్పారు.

మధ్యాహ్నం దినేష్ వచ్చి నన్నూ లిల్లీని లంచ్‌కి తీసుకెళ్ళాడు. మంచి ఎండలో చాలా దూరం వెళ్ళి తినొచ్చాం. బాగా అలసిపోయాం. లిల్లీ ఫ్రెండ్స్ కొందరు మారియట్ హోటల్‌లో కలిసారు. అందులో రిజ్వాన్ ఒకరు. అతి పెద్ద పోస్ట్‌లో ఉన్నాడు. ఒకప్పుడు కువైట్‌లో తనకీ తన చెల్లెలకీ కొలీగ్ అని చెప్పింది. అతను పలకరించి వెళ్ళాడు. అహ్మద్ అనే ఈజిప్షియన్ మాత్రం లిల్లీతో బుకింగ్స్ గురించి ఫోన్స్‌లో మాట్లాడాడు కానీ చూడలేదట. వచ్చి పలకరించి మర్నాడు కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేద్దాం అని ఆహ్వానించాడు. లిల్లీ ఇండియా నుండి తెచ్చిన స్వీట్స్ ఇచ్చింది అతనికి.



వీరేంద్రనాథ్ గారు, దినేష్‌తో

నేను రెండుగంటల సేపు నిద్రపోయా. తర్వాత సాయంత్రం లేచి రెడీ అయి షెరాటన్ హోటల్‌కి వెళ్ళాం. గుమ్మంలోనే వీరేంద్రనాథ్‌గారు ఎదురు పడ్డారు. ఆప్యాయంగా పలకరించారు. ‘TEAM’ అంటే తెలుగు, ఎంట్రపెన్యూయర్స్ ఎండ్ ఎఛీవర్స్ మీట్‌ట. చాలామంది అక్కడ బిజినెస్ చేస్తున్న పెద్ద పెద్ద డైరెక్టర్, వాళ్ళూ వచ్చారు. చాలా బాగా మాట్లాడారు. బిజినెస్ అంటే కొంత అవగాహన ఏర్పడింది. వీరేంద్రనాథ్‌గారి స్పీచ్ హైలైట్. ఎన్నో విషయాలు చెప్పారు. ఇదంతా త్రిమూర్తులు కేశవులు అనే యంగ్ ఎంట్రప్రెన్యూర్ నిర్వహించాడు. ఆ కంపేరర్ పాపం ఎందమూరి.... ఎందమూరి అని ఈయన పేరుని ఖూనీ చేస్తూ డయాస్ మీదకి ఆహ్వానించింది.

ప్రోగ్రాం అనంతరం అందరం ఫోటోస్ తీయించుకున్నాం. మగవాళ్ళు డ్రింక్స్ వైపు వెళ్ళారు. మేం భోజనాలు చేసాం.



అహ్మద్‌తో బ్రేక్‌ఫాస్ట్

లిల్లీ నేనూ మర్నాడు రాత్రి కలిసి షార్జా ఫ్లయిట్ ఎక్కాల్సిన వాళ్ళం. అనుకోకుండా తన ఫ్లయిట్ ప్రొద్దుటికి టైమింగ్స్ మారినట్లు వాళ్ళ ట్రావెల్ ఏజెంట్ ఫోన్ చేసాడు.

దాంతో లిల్లీ నన్ను వదిలి వెళ్ళడానికి చాలా బాధపడింది. హోటల్‌లో నేను సాయంత్రం చెక్ అవుట్ చేస్తానని చెప్పి మాట్లాడింది. ఏం పర్వాలేదని నేనే ధైర్యం చెప్పాను. ఆ రాత్రి మేం కొన్న వస్తువులతో సూట్ కేసులు పొట్టలు విచ్చుకుపోయాయి. కష్టపడి సర్ది లిల్లీ నాకో సూట్‌కేస్ ఎడిషనల్‌గా ఇచ్చింది వాళ్ళ చెల్లెలికి అందచెయ్యమని. రాత్రి "మాట్లాడండి మేడం.. మళ్ళీ ఎప్పుడు కలుస్తామో" అంటూ ఉండగానే నిద్రలోకి జారిపోయానుట.

లిల్లీ నేనూ ఉదయమే తయారయి అహ్మద్‌తో బ్రేక్‌ఫాస్ట్ చేసాం. అతను ఈజిప్ట్ నుండి వచ్చాడు. 'పెళ్ళి అయిందా? ' అని అడిగాను. కాలేదన్నాడు. వాళ్ళ దేశం పిల్లని తప్ప వేరే దేశం పిల్లని పెళ్ళాడడానికి మతం ఒప్పుకోదన్నాడు. ఇద్దరం లిల్లీని టాక్సీ ఎక్కించాం.

లిల్లీకి వెళ్తుండగా కళ్ళనిండా నీళ్ళు. నాకూ అలాగే అనిపించింది. నన్ను ఆ నాలుగురోజులూ ఎంత బాగా చూసుకుందంటే బహుశా నా పిల్లలు మాత్రమే అలా కేర్ తీసుకుంటారేమో! ఇది ఏనాటి బంధమో కదా!



లిల్లీ వెళ్ళాక ఒంటరిగా రూంకి వెళ్ళాలనిపించలేదు. టాక్సీ పిలిపించుకుని తిన్నగా గోల్డ్‌సూక్‌కి వెళ్ళాను. నాకు ఏమీ కొనుక్కోలేదని గుర్తొచ్చి ఒక చైన్, రింగులూ కొనుక్కున్నాను. అక్కడ ఊరంతా మలయాళీయులే ఎక్కువగా ఉంటారు. ఒక స్మార్ట్ ఫోన్, కొన్ని బట్టలూ, పెర్ఫ్యూమ్స్ కొన్నాను. బాగా చెయ్యి నెప్పి పుట్టి ఇంక మొయ్యలేను అనుకున్నాకా, రెస్టారెంట్‌లోకి వెళ్ళి తిని టాక్సీ ఎక్కి హోటల్ కొచ్చా. నిద్రపోయి లేచి నేనే ఫోన్ చేసి ఫైవ్‌కల్లా చెక్ అవుట్ చేసా. అర్ధరాత్రి 12.30కి ఫ్లయిట్, ఏం చెయ్యాలో తోచక బిజినెస్ సెంటర్‌కి వెళ్ళి మా పెద్దాడితో చాటింగ్ చేసా! ఫోన్ లేకుండా ఎఫ్.బీ లేకుండా ప్రశాంతంగా నాలుగు రోజులు ఉన్నానా? అని ఆశ్చర్యంగా అనిపించింది.

దుబయ్ అంటే Do-buy అన్న గైడ్ మాటలు ఎంత నిజం. కొనడానికే వచ్చినట్లు షాపింగ్ మాల్స్ అన్నీ కిక్కిరిసి ఉన్నాయి. అసలు దుబాయే పెద్ద మాల్.

నేను బిజినెస్ సెంటర్‌లో నుండి బయటకి వస్తుంటే శ్రీకాంత్ అనే మన తెలుగు అబ్బాయి ఫ్రంట్ డెస్క్‌లో ఉన్నాడు. నన్ను చూసి దగ్గరకొచ్చి "మీ ఫ్లయిట్ రాత్రికి కదా మేడం, 7వఫ్లోర్‌లో పూల్ సైడ్ వెళ్ళి రిలాక్స్ అవండి" అన్నాడు. అతనికి థాంక్స్ చెప్పి వెళ్తుంటే "ఏమైనా తింటారా? తాగుతారా? పంపించాలా?" అని అడిగితే కాఫీ పంపించమని పైకి వెళ్ళాను. పూల్ దగ్గర ఎవరూ లేరు.

అక్కడున్న కాట్ మీద పడుకుని కాఫీ తాగుతూ, "ఎక్కడ నేనూ, ఎక్కడ దుబాయ్.. ఒంటరిగా ఇక్కడ ఈ రాత్రి తొమ్మిదివరకు ఇలా ఉంటానని ఎన్నడైనా అనుకున్నానా?" అని ఆలోచించాను.

తీరా టాక్సీ ఎక్కాక చూసుకుంటే 70 దిరమ్స్ ఉన్నాయి. డ్రైవర్ని ఎంత అవుతుంది అని అడిగితే "వంద కావచ్చు మేడమ్" అన్నాడు. ఏ.టి.ఎమ్ దగ్గర ఆపమని నా డెబిట్ కార్డ్ పెట్టి 100 దిరమ్స్ తీసాను. (అదే మినిమమ్ ఎమౌంట్ మరి.)



ఒక్కదాన్నే ఎయిర్‌పోర్ట్‌లో

టాక్సీ డ్రైవర్ నా గురించి అడిగి, అతని భార్యా పిల్లల వివరాలు చెప్పాడు. ఎక్కువగా బంగ్లాదేశ్, పాకిస్తానీలే టాక్సీలు నడుపుతున్నారు.

నేను లోపలికి వెళ్ళాక, వీరేంద్రనాథ్‌గారు కనిపించారు. ఆయన ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లోంచి నన్ను చూసి బయటకి వచ్చేసారు. డిజర్ట్‌సఫారీకి చాలినంత మంది మనుషులు లేక కాన్సిల్ అయిందనీ, తను చూడలేదనీ చెప్పారు. ఫ్లయిట్ లేట్‌గా వచ్చింది. మూడుసార్లు గేట్స్ మార్చారని ఎనౌన్స్ చేసారు. మొత్తానికి ఆయనతో కబుర్లు చెపుతూ ఉండగా ఫ్లయిట్ వచ్చింది. ఈలోగా ఆయన అభిమానులు వచ్చి ఆయన ఆటోగ్రాఫ్‌లు తీసుకుని ఆనందించారు.

నాతోబాటు ఎక్కిన ముస్లిం అమ్మాయి "ఎక్కడ పడితే అక్కడ ఎందుకు కూర్చోకూడదూ? అందరికీ కావలసినన్ని సీట్లు ఉంటాయిగా" అని అడిగింది.

"మీది హైదరాబాదా?" అడిగాను ఉర్దూలో.

అవునంది.

"మరదే" అని తనని తీసుకెళ్ళి నా సీటు పక్కన తన నెంబరు చూసి కూర్చోపెట్టాను.

సీట్ బెల్ట్ పెడ్తుంటే ఒక్కటే పకపకా నవ్వు... చక్కిలిగింతలుట. తరువాత దాహం దాహం అని గొడవ. చెప్పానుగా ఎయిర్ ఇండియా ఎయిర్ హోస్టెస్‌లు 'ధుమధుమా' ఒకంతట నీళ్ళు ఇవ్వలేదు. ఫ్లయిట్ కదిలాకా జ్యూస్ ఇచ్చారు. ఇంతలో ఒక ముసలాయనకి మైల్డ్ హార్ట్ ఎటాక్ వచ్చింది "డాక్టర్ కావాలి" అని ఎనౌన్స్‌మెంట్ ఇచ్చారు. ఏం జరుగుతోందని అడిగింది. చెప్పాను.

"హాయ్ అల్లా.... కిందకి దింపొచ్చుగా విమానం అంటుంది."

నా పక్క పిల్ల ఏదో పేరు చెప్పింది. గుర్తులేదు పదేళ్ళ పిల్లగా ఉన్నప్పుడు దుబాయ్ వెళ్ళి ఇప్పుడే మళ్ళీ వస్తోందిట. "బురఖా తియ్యకపోతే మీవాళ్ళు నిన్ను ఎలా గుర్తుపడతారు? " అని అడిగాను కూడా.

"నేను గుర్తుపడతానుగా మా అన్నయ్యని"

ఫుడ్ వచ్చాక అన్నీ చూసి "నేను తినను. ఏం బాగా చెయ్యలేదు" అంది. నాకు ఇచ్చిన ఫ్రూట్స్ కూడా తనకే ఇచ్చాను. ఏం తిన్నా బురఖాలోంచే తింది.

నేనూ అంత రాత్రి తినే సాహసం చెయ్యక బన్ తిన్నాను బటర్‌తో.

లిల్లీ నేను షాపింగ్‌కి వెళ్ళినప్పుడు ఫోన్ చేసి, బిజినెస్ సెంటర్లో కూడా నా గురించి ట్రై చేసిందట. ఎక్కడికెళ్ళానో తెలీక కంగారు పడిందట. కానీ తను కువైట్ చేరగానే నా మెయిల్ చూసుకుని షాపింగ్‌కి వెళ్ళానని తెలిసి ఆనందపడింది.

నేను రాజీవ్ గాంధి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో దిగి ఇమ్మిగ్రేషన్ అయి బయటకి వచ్చేసరికి మా ఆయన, వీరేంద్రనాథ్ గారూ మాట్లాడుతూ కనిపించారు.

మా కారులో ఇంటికొస్తూ నేను ఈ విషయాలన్నీ మా ఆయనకి చెప్తూనే ఉన్నాను.

ఈలోగా కిటికీలోంచి చూస్తే ఎవడో రోడ్ పక్కన మూత్రం పోస్తూ కనిపించాడు. "చూసావా? మన దేశంలో ఎంత స్వేచ్ఛో! వాడి మొహం చూస్తే స్వర్గంలో ఉన్నట్టు ఫీలవుతున్నాడు అన్నారు" మా ఆయన.

"అవును సర్! మనదేశమే మంచిగుంటది మూత్రం పోస్తే, ఉమ్మేస్తే శిక్షలంటే ఎట్ల బతుకుతం సర్" అన్నాడు మా డ్రైవర్ కుమార్.

"ఛీ మీరు మారరా..! ఇవన్నీ కౌముదిలో రాసుకుంటా " అంటుంటే మా ఆయన ముసిముసిగా నవ్వాడు.

Post your comments

